
బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10 లోని పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ ఆఫీస్‌లో కీలక వ్యక్తి


బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10లో కారును రహస్య ప్రదేశంలోకి తీసుకెళ్తున్న పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కార్యాలయ సిబ్బంది


కారు వద్దకు ఫైళ్లను తీసుకెళ్తున్న రాఘవ ఆఫీసు సిబ్బంది


కారు వద్దకు డబ్బు సంచిని తీసుకెళ్తున్న కార్యాలయానికి చెందిన మరో సిబ్బంది


నోట్ల కట్టలున్న ఒక సంచి, బ్యాగును తీసుకెళ్తున్న మరో వ్యక్తి


కార్యాలయంలోని సీపీయూను తీసుకెళ్తున్న యువకుడు


రహస్య ప్రదేశం నుంచి దస్త్రాలు, నోట్ల కట్టలతో వెనక్కి వెళ్తున్న కారు

# ..పొంగులేటిపై ఈడీ రెయిడ్

> మొదటిపేజీ తరువాయి...

హర్షారెడ్డి, కోడలు కూడా అక్కడే ఉంటున్నారని చెప్తున్నారు. జూబ్లీహిల్స్‌లో పొంగులేటికి మరో ఇల్లు ఉన్నది. అక్కడ ఆయన కూతురు ఉంటున్నారు. ప్రస్తుతం మినిస్టర్ క్వార్టర్స్‌లోనూ ఆయనకు అధికారిక నివాసం ఉండగా, దానిని తన సంస్థల కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. ఇక బంజారాహిల్స్‌లో రాఘవ ఇన్‌ఫ్రాకు సంబంధించిన కార్యాలయాలు ఉన్నాయి. జూబ్లీహిల్స్ నివాసం కేంద్రంగా పొంగులేటి కార్యక్షేత్రాలపై ఈడీ దాడులు జరిగాయి. ఈడీ బృందాల తనిఖీల నేపథ్యంలో సీఆర్పీఎఫ్ బలగాలు ఆయన నివాసాలు, ఆఫీసులను ఆధీనంలోకి తీసుకున్నాయి.


ఈడీ సోదాల సందర్భంగా పొంగులేటి నివాసం వద్ద సీఆర్పీఎఫ్ జవాన్

### ఉదయం నుంచీ మినిస్టర్ క్వార్టర్స్‌లోనే

దాడులకు కొద్దిసేపు ముందే సమాచారం అందుకున్న పొంగులేటి హడావిడిగా మినిస్టర్ క్వార్టర్స్‌లోని తన నివాసానికి వెళ్లిపోయారు. ఆయన రోజంతా అక్కడే ఉన్నారు. ఈడీ దాడులకు సంబంధించి ఏం జరుగుతున్నదో ఎప్పటికప్పుడు తన వ్యాపార సంస్థల ముఖ్యుల నుంచి వివరాలు తెలుసుకుంటూ ఉన్నారని తెలిసింది. మరోవైపు ఈడీ సోదాల నేపథ్యంలో మంత్రి పొంగులేటి శుక్రవారం బయట ఎక్కడా ప్రభుత్వ కార్యక్రమాల్లో కనిపించలేదు. అధికారులతో సమీక్షతోపాటు పలు కార్యక్రమాలను ఆయన రద్దు చేసుకున్నట్టు తెలిసింది. మరోవైపు పొంగులేటి వియ్యంకుడు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి దాడులు జరుగుతున్న సమయంలో జూబ్లీహిల్స్ నివాసానికి తరలివచ్చారు. అధికారుల అనుమతితో ఆయన ఫోన్లు తీసుకుని భద్రతాసిబ్బంది లోనికి అనుమతించారు. సుమారు గంటపాటు లోపల ఉన్న ఆయన తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు.

### హర్షారెడ్డిని విచారించిన అధికారులు

ఈడీ దాడులు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగాయి. సుమారు 16 గంటలపాటు కొనసాగిన ఈ సోదాలపై ఉదయం నుంచీ ఉత్కంఠ నెలకొన్నది. జూబ్లీహిల్స్ నివాసంలో మంత్రి తనయుడు హర్షారెడ్డిని ఈడీ అధికారులు విచారించారు. సోదాలు జరుగుతున్నంతసేపు ఆయనే అక్కడే ఉన్నారు. మధ్యాహ్నం వేళ రాఘవ గ్రూప్‌కు సంబంధించిన ఆడిటర్‌ను పిలిపించిన ఈడీ అధికారులు.. ఆయనతోకలిపి హర్షారెడ్డిని విచారించారు. ఈ సందర్భంగా పలు కీలక లావాదేవీలు, అనుమానాస్పద కార్యకలాపాలు, అక్రమాస్తులపై ఈడీ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. పొంగులేటి వివాదాలపైనా వారు ఆరా తీసినట్టు చర్చ జరుగుతున్నది.

### పొంగులేటి వివాదాలపైనా ఆరా

మంత్రి పొంగులేటి నివాసాలు, ఆఫీసుల్లో ఈడీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించిన నేపథ్యంలో ఏ కేసు కేంద్రంగా వారు ప్రధానంగా విచారిస్తున్నారనే దానిపై రకరకాల వార్తలు వెలువడుతున్నాయి. ఎఫ్ఐయూ జోక్యం చేసుకోవడంతో ఈ కేసు వందల కోట్ల విలువైన లావాదేవీలతో ముడిపడి ఉండవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి కాలంలో పొంగులేటి ఆర్థిక వ్యవహారాలను కమ్ముకున్న పలు అభియోగాలను వారు ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు.

## ఫెమా ఉల్లంఘన కేసులు కూడా

పొంగులేటి కంపెనీల చుట్టూ ముసురుకున్న ఎగ్జిమ్ బ్యాంక్ గ్యారెంటీలు, లగ్జరీ వాచీలు, బోగస్ కంపెనీలు-టీడీఎస్ కేసులు మనీలాండరింగ్ చట్టంతో పాటు ఫెమా (ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్) ఉల్లంఘనల కిందకు వస్తాయని నిపుణులు చెప్తున్నారు. విదేశీ మారకం, విదేశీ బ్యాంకులు, ఎగుమతులు-దిగుమతులు, గూడ్స్ అండ్ సర్వీసులకు సంబంధించిన అక్రమాలు ఫెమా చట్టం కిందకే వస్తాయని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.

### తెరపైకి యూరో బ్యాంక్ గ్యారెంటీలు!

పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో రూ.4,495 కోట్ల కాంట్రాక్ట్ పనులు దక్కించుకున్నది. ఈ క్రమంలో వెస్టిండీస్‌లోని ఎగ్జిమ్‌బ్యాంకు నుంచి ఏపీ ప్రభుత్వానికి రూ. 80 కోట్ల విలువైన గ్యారెంటీలు సమర్పించింది. అయితే, ఆ గ్యారెంటీలపై ఏపీ సర్కారు అనుమానాలు వ్యక్తం చేయడం, దేశీయ బ్యాంకింగ్ సంస్థలను కాదని ఎక్కడో కరేబియన్ దీవుల్లోని ఎగ్జిమ్‌బ్యాంకు నుంచి పొంగులేటి గ్యారెంటీలు సమర్పించడం అనుమానాలకు తావిచ్చింది.

### కొడుకు మెడకు లగ్జరీ వాచీల కేసు

హాంకాంగ్ నుంచి సింగపూర్ మీదుగా చెన్నైకి అక్రమంగా తరలిన పాటెక్ ఫిలిప్ 5740, రెండోది బ్రెగ్యుట్ 2759 వంటి ఖరీదైన చేతిగడియారాల కేసులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కొడుకు హర్షారెడ్డికి చెన్నై కస్టమ్స్ అధికారులు ఇప్పటికే పలు మార్లు నోటీసులు ఇచ్చారు. మద్రాస్ హైకోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉన్నది. పట్టుబడిన వాచీల విలువ రూ. 8 కోట్ల వరకు ఉన్నప్పటికీ, అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషించిన మధ్యవర్తి నవీన్ కుమార్ రూ. 100 కోట్లకు పైగా స్మగ్లింగ్ చేసినట్టు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. క్రిప్టో, హవాలా ద్వారా పెద్దయెత్తున అక్రమ లావాదేవీలు జరిగినట్టు పేర్కొన్నారు.

### 650 కోట్ల టీడీఎస్ ఎగవేత ఆరోపణలు

రూ.650 కోట్ల విలువైన టీడీఎస్‌ను ఎగ్గొట్టేందుకు రాఘవ గ్రూప్ ఆఫ్ కంపెనీ నిర్వాహకులు మూడు బోగస్ కంపెనీలను సృష్టించారని వార్తలు వచ్చాయి. కాగితాలకు మాత్రమే ఈ కంపెనీలు పరిమితమయ్యాయా? నిజంగానే ఉన్నాయా? ఒకవేళ ఉంటే ట్యాక్స్ ఎలా ఎగ్గొట్టాయి? అనే వివరాలకు సంబంధించి డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు ఆరునెలల కిందటే రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్)ను నమోదు చేశారు. ఇప్పుడు ఆ విషయమై సోదాలు జరిగినట్టు వార్తలు వస్తున్నాయి.

### తెరపైకి అక్రమాస్తులు!

మంత్రి పొంగులేటి కుమారుడు పొంగులేటి హర్షారెడ్డికి రూ.1,300 కోట్ల పైచిలుకు ఆస్తులున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఈ మేరకు ఆస్తులు ఉన్నట్లైతే, వాటికి సంబంధించిన ఆదాయపు పన్ను చెల్లింపులు సరిగ్గా జరుగుతున్నాయా? ఆస్తులకు సంబంధించిన పత్రాలు అన్నీ సరిగ్గా ఉన్నాయా? అనే కోణంలో ఈ సోదాలు జరుగొచ్చని అంచనా వేస్తున్నారు.

### రెండు కంపెనీల బంధం

శుక్రవారం నాటి సోదాలకు కేంద్ర బిందువుగా మారిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ అనే కంపెనీతో కోట్లల్లో లావాదేవీలు జరిగినట్టు ఈడీ అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఈ రెండు కంపెనీల టర్నోవర్, డైరెక్టర్లు ఇతరత్రా వివరాలపైనా ఈడీ దృష్టిసారించినట్టు చెప్తున్నారు.

## ఎగ్జిమ్ బ్యాంక్‌పై ఏపీ నోటీసులు

పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి అప్పగించిన 4,495 కోట్ల కాంట్రాక్టులో అవకతవకలు జరిగాయంటూ ఏపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈమేరకు కంపెనీకి నోటీసులు ఇచ్చింది. ఇక, వెస్టిండీస్‌కు చెందిన వివాదాస్పద ఎగ్జిమ్ బ్యాంకు నుంచి రూ. 80 కోట్ల బ్యాంకు గ్యారెంటీలను రాఘవ కంపెనీ సమర్పించడాన్ని కూడా ఏపీ సర్కారు తప్పుబట్టింది. భారత్‌కు చెందిన మరేఇతర బ్యాంకు నుంచి గ్యారెంటీలు సమర్పించాల్సిందిగా నోటీసులు ఇచ్చింది.

## వివాదాల ఎగ్జిమ్ బ్యాంక్

వెస్టిండీస్‌లోని సెయింట్ లూసియాలో కేంద్రంగా ఉన్న యూరో ఎగ్జిమ్ బ్యాంక్‌పై అనేక ఆరోపణలున్నాయి. మధ్యప్రదేశ్‌లో ఓ సంస్థ డిఫెన్స్ పనుల కాంట్రాక్టును సాధించింది. పనులు చేపట్టే ముందు ఈ బ్యాంకు నుంచే గ్యారెంటీలు సమర్పించింది. వాటిని ఆధారంగా చేసుకొని అధికారులు పనులు అప్పగించారు. చివరకు ఆ సంస్థ బిచాణా ఎత్తేసింది. పనులను పూర్తిచేయలేదు. దీంతో అధికారులు నష్టపరిహారం కోసం బ్యాంక్ గ్యారెంటీలను స్వాధీనం చేసుకుందామనుకుంటే వాళ్లు సమర్పించిన గ్యారెంటీలు చెల్లలేదు. అంటే ఆ బ్యాంక్ బోగస్ అని అర్థమవుతున్నది. కాగా, వివిధ సంస్థలకు వేల కోట్ల గ్యారెంటీలను ఇస్తున్న ఎగ్జిమ్ బ్యాంక్ వాస్తవ విలువ రూ. 8 కోట్లు మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా 650కి పైగా శాఖలున్నట్టు ఈ బ్యాంకు చెప్పున్నప్పటికీ, అదంతా అబద్ధం. మన దేశంలో ఒక్క శాఖ కూడా లేని ఇలాంటి బ్యాంకు.. పొంగులేటి కంపెనీకి గ్యారెంటీలు సమర్పించడం ఇప్పుడు వివాదంగా మారింది.

## పొంగులేటి నివాసంలో భారీగా నగదు?

- లెక్కించడానికి 3 యంత్రాలు
- పదుల సంఖ్యలో అధికారులు
- గంటల తరబడి నోట్ల లెక్కింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో సోదాలు జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులకు భారీగా నగదు పట్టుబడినట్టు తెలుస్తున్నది. ఉదయం 8 గంటలకు పొంగులేటి నివాసానికి ఈడీ అధికారులు చేరుకున్నారు. కాసేపు సోదాలు నిర్వహించిన తర్వాత ఈడీ సిబ్బంది ఒక నోట్ల లెక్కింపు యంత్రాన్ని తెప్పించారు. ఆ తర్వాత కొద్ది సేపటికి మరో యంత్రాన్ని తెప్పించారు. ఈ రెండు యంత్రాలతో కాసేపు నోట్ల లెక్కింపు జరిగిన తర్వాత ఈడీ సిబ్బంది మరో నోట్ల లెక్కింపు యంత్రాన్ని పొంగులేటి ఇంట్లోకి తీసుకెళ్లారు. పొంగులేటి నివాసం బయట ఉన్న విలేకరులు, స్థానికుల ముందే మూడు యంత్రాలు ఇంటి లోపలికి పట్టుకెళ్లారు. పదుల సంఖ్యలో సిబ్బంది, గంటల తరబడి, మూడు యంత్రాలపై నోట్లను లెక్కించాల్సి వచ్చిందంటే పొంగులేటి నివాసంలో ఈడీ అధికారులకు భారీగానే నోట్ల కట్టలు దొరికాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోదాల్లో కోట్లాది రూపాయలు లభించిన సందర్భాల్లోనే ఈడీ అధికారులు ఒకటికి మించి యంత్రాలను వినియోగించాల్సి వస్తుంది. పొంగులేటి నివాసం వద్ద కూడా ఇలాంటి పరిస్థితులే కనిపించాయి. కాగా, ఈడీకి పట్టుబడ్డ నగదులో కొంత విదేశీ కరెన్సీ కూడా ఉందనే ప్రచారం కూడా జరుగుతున్నది. అయితే, ఈ విషయంపై స్పష్టత రావాల్సి ఉన్నది. ఎంత నగదు పట్టుబడిందనే విషయాన్ని ఈడీ అధికారిక ప్రకటన ద్వారా ప్రకటించనుంది.

# కీలక ఫైళ్లు మాయం

- ఈడీ సోదాలకు ముందే రహస్య ప్రాంతాలకు తరలింపు
- కంప్యూటర్ హార్డ్‌డిస్కులు, సీపీయూలు సైతం బయటకు..

హైదరాబాద్, సెప్టెంబర్ 27: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోదాలు జరపనున్న విషయంలోపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ముందే సమాచారం అందిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈడీ అధికారులు వస్తున్నారని తెలిసి ముందే జాగ్రత్తపడ్డారని తెలుస్తున్నది. శుక్రవారం ఉదయం ఈడీ అధికారులు పొంగులేటి నివాసం, కార్యాలయాలకు చేరకముందే కీలక డాక్యుమెంట్లను పొంగులేటి కార్యాలయాల నుంచి కీలక ఫైళ్లు, కంప్యూటర్ సీపీయూలు, హార్డ్ డిస్కులు మాయం చేశారని తెలుస్తున్నది. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లోని రాఘవ టవర్స్‌లో పొంగులేటికి చెందిన నిర్మాణ సంస్థల కార్యాలయాలు ఉన్నాయి. ఆయన వ్యాపార సామ్రాజ్యం మొత్తం ఈ భవనం నుంచే పని చేస్తుంది. అయితే, శుక్రవారం ఈడీ అధికారులు రంగంలోకి దిగే ముందే కొందరు వ్యక్తులు రాఘవ టవర్స్ వద్దకు చేరుకున్నారని తెలుస్తున్నది.

### ముందు సెల్లార్‌కు.. అక్కడి నుంచి సేఫ్ ప్లేస్‌కు..

ఈ భవనానికి కొంత దూరంలో కార్లను నిలిపి, రాఘవ సంస్థ కార్యాలయంలోకి చేరుకున్నట్టు సమాచారం. ముందుగా పదుల సంఖ్యలో సంచులను భవనం సెల్లార్‌లోకి తీసుకొచ్చారని, అక్కడి నుంచి క్షణాల్లో వాటిని కార్లలో నింపి 'సేఫ్' ప్లేస్‌లకు తరలించినట్టు తెలుస్తున్నది. నిమిషాల వ్యవధిలో పదుల సంఖ్యలో సంచులు కార్యాలయం నుంచి బయటపడ్డాయని సమాచారం. వీటిల్లో పొంగులేటి వ్యాపారాలకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు, కంప్యూటర్ సీపీయూలు, హార్డ్ డిస్కులు ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. భారీగా నగదు సైతం ఉండే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటిని తరలించింది మంత్రి అనుచరులు, ఆయన వ్యాపార సంస్థల్లో పని చేసే సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది అని తెలుస్తున్నది. అయితే, పొంగులేటి సంస్థల్లో కీలక అధికారులు కొద్ది దూరంలో ఉండి ఆదేశాలు ఇస్తూ తరలింపు పనికి పురమాయించినట్టు అనుమానాలు ఉన్నాయి.

## తెల్లవారుజామునే ఇంటి నుంచి వెళ్లిన పొంగులేటి

- ఈడీ అధికారులు చేరుకోకముందే బయటకు..
- ఫోన్‌లలో వ్యవహారాలు చక్కబెట్టారనే అనుమానాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 27: తన ఇండ్లు, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు దాడులు చేయబోతున్నారనే విషయం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ముందే తెలిసిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సహజంగా పది గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లే పొంగులేటి శుక్రవారం మాత్రం తెల్లవారుజామున ఆరున్నర గంటలకే బయటకు వెళ్లిపోయారని సమాచారం. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన ఒక చోట కూర్చొని ఫోన్‌ల మీద వ్యవహారాలు చక్కబెట్టారని తెలుస్తున్నది. తన కీలక అనుచరులు, తన సంస్థల్లో పని చేసే కీలక ఉద్యోగులతో ఆయన అనుక్షణం టచ్‌లో ఉన్నారనే ప్రచారం జరుగుతున్నది. మరికాసేపట్లో ఈడీ అధికారులు రంగంలోకి దిగుతారనగా ఆయన అన్ని ముందు జాగ్రత్తలూ తీసుకున్నారని తెలుస్తున్నది. ఈడీ సోదాల సమాచారాన్ని సైతం ఆయన ఎప్పటికప్పుడు తెలుసుకున్నారని సమాచారం. గతంలో ఈడీ, ఐటీ అధికారులు సోదాలు నిర్వహించిన సమయంలోనూ ఆయన ఇదే రకంగా జాగ్రత్త పడ్డట్టు చెప్తున్నారు.

# ఏమిటీ వాచీల స్మగ్లింగ్ కేసు?

- రూ.కోట్ల విలువైన వాచీల అక్రమ రవాణా
- గతంలో పొంగులేటి హర్షకు చెన్నై కస్టమ్స్ నోటీసులు
- హర్షను అరెస్టు చేసి విచారించాలన్న అలందూరు కోర్టు



హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆయన తనయుడు హర్షారెడ్డి నివాసాలపై శుక్రవారం జరిగిన ఈడీ సోదాలు ఓ స్మగ్లింగ్ కేసుకు సంబంధించినవేనన్న వాదన ఒకటి వినిపిస్తున్నది. వాచీల కోసం కోట్ల రూపాయలను క్రిప్టో ద్వారా పంపి హర్షారెడ్డి మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ గుర్తించినట్టు తెలిసింది. చెన్నై కస్టమ్స్ అధికారుల నివేదిక ఆధారంగానే ఢిల్లీకి చెందిన 16 బృందాలతో శుక్రవారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారని అంటున్నారు. రూ.1.7 కోట్ల విలువైన వాచీల అక్రమ రవాణా కేసులో పొంగులేటి హర్షారెడ్డికి చెన్నై కస్టమ్స్ అధికారులు గత మార్చి 28న నోటీసులు ఇచ్చి.. ఏప్రిల్ 4న తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించారు. అయితే డెంగీ జ్వరం కారణంగా రాలేనని, ఏప్రిల్ 27న ప్రత్యక్షంగా హాజరౌతానని ఆయన లేఖ రాశారు. అప్పట్లో హర్షారెడ్డి తనకు వాచీల అక్రమ రవాణాతో సంబంధం లేదని జాతీయ మీడియాతో చెప్పారు. అయితే, ఇదే కేసులో చెన్నైకి చెందిన కస్టమ్స్ అధికారులు గత జూన్ మూడో వారంలో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

### హాంకాంగ్ టు చెన్నై.. వయా సింగపూర్!

చెన్నై విమానాశ్రయంలో ఫిబ్రవరి 5న కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.1.7 కోట్ల విలువైన రెండు లగ్జరీ వాచ్‌లు పొంగులేటి హర్షారెడ్డి కోసమేనని దర్యాప్తులో తేలినట్టు తెలిసింది. హాంకాంగ్ నుంచి సింగపూర్ మీదుగా వచ్చిన మహమ్మద్ ఫహెర్దీన్ ముబీన్ అనే వ్యక్తి నుంచి కస్టమ్స్ అధికారులు ఆ వాచీలను స్వాధీనం చేసుకున్నారు. ఆ వాచీలలో ఒకటి పాటెక్ ఫిలిప్స్ 5740, రెండోది బ్రెగ్యుట్ 2759గా గుర్తించారు. పాటెక్ ఫిలిప్స్ వాచీకు మన దేశంలో ఎక్కడా డీలర్లు లేకపోవడం.. బ్రెగ్యుట్ కంపెనీల వాచీలు ఇండియా మార్కెట్‌లో స్టాక్ లేకపోవడంతో వాటిని స్మగ్లింగ్ చేసినట్టు నిర్ధారణకు వచ్చారు. వాటి విలువ రూ.1.7 కోట్లు పైగా ఉంటుందని తేల్చారు. దీంతో ముబీన్‌ను అరెస్టు చేసి, కోర్టు అనుమతితో విచారణ చేయగా మధ్యవర్తి నవీన్‌కుమార్ పేరు బయటకు వచ్చింది.

### క్రిప్టో చెల్లింపులు.. హవాలా లావాదేవీలు!

చెన్నై కస్టమ్స్ అధికారులు ఈ కేసును సీరియస్‌గా తీసుకొని దర్యాప్తు చేపట్టారు. మార్చి 12న ఈ కేసులో వారికి అలోకం నవీన్ కుమార్ ద్వారా మరిన్ని ఆధారాలు లభించినట్టు సమాచారం. నవీన్‌కుమార్ ద్వారానే ముబీన్ నుంచి హర్షారెడ్డి వాచీలను కొనుగోలు చేసినట్టు కస్టమ్స్ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ది ట్రెజరీ (యూఎస్‌డీటీ)కి చెందిన టెథర్ వంటి క్రిప్టో కరెన్సీ రూపంలో డబ్బులు చెల్లించారని కస్టమ్స్ అధికారులు దర్యాప్తులో వెల్లడైనట్టు తెలిసింది. హర్షారెడ్డి కోసమే వాచీలు తీసుకొచ్చానని నవీన్‌కుమార్ తన వాంగ్మూలంలో అంగీకరించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే హర్షారెడ్డికి కస్టమ్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

## మొత్తం రూ.100 కోట్లకు పైనే స్మగ్లింగ్..

డబ్బున్న వ్యక్తులకు ఖరీదైన వాచీలను సప్లయ్ చేయడంలో ముబీన్, నవీన్‌కుమార్ ఆరితేరినట్టు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. ఈ కేసులో చెన్నై కస్టమ్స్ అధికారులు మార్చి 18న మద్రాస్ హైకోర్టుకు ఇచ్చిన వివరణలో లగ్జరీ వాచీల స్మగ్లింగ్ సుమారు రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని తెలిపారు. ముందస్తు బెయిల్ కోసం నవీన్‌కుమార్ పెట్టుకున్న పిటిషన్‌ను హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది. రూ.100 కోట్లకుపైగా ఉన్న ఈ స్మగ్లింగ్‌లో బెయిల్ ఇవ్వడం కుదరదని కోర్టు స్పష్టంచేసింది. తమిళనాడులోని అలందూరు కోర్టు వెంటనే నవీన్‌కుమార్‌ను అరెస్టు చేసి, హర్షారెడ్డిని విచారించాలని ఏప్రిల్‌లో ఆదేశాలు జారీచేసింది. దీంతో ఏప్రిల్ 4న తమ ఎదుట హాజరుకావాలని హర్షారెడ్డికి నోటీసులు అందాయి.



# తీవ్రమైన ఆర్థిక నేరాల్లో పొంగులేటి కుటుంబం!

అందుకే ఎఫ్ఐయూ జోక్యం • 100 కోట్ల పైబడిన కేసులపైనే ఈ విభాగం ప్రత్యేకమైన దృష్టి

పొంగులేటి అక్రమాల చిట్టాను 4 దశల్లో వడబోసిన ఎఫ్ఐయూ • ఎఫ్ఐయూ ఇచ్చిన కచ్చితమైన సమాచారంతో రంగంలోకి ఈడీ

*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

*న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్, దాని అనుబంధ కంపెనీలు తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడ్డాయా? హవాలా మార్గంలో భారీఎత్తున సొమ్మును విదేశాలకు మళ్లించాయా? కాగితాల్లో మాత్రమే కనిపించే బోగస్ కంపెనీలను సృష్టించి ఆ ముసుగులో భారీ స్కామ్‌లకు తెగబడ్డాయా? చూపించిన ఆదాయానికి చెల్లించిన పన్నులకు ఎక్కడా పొంతన లేదా? ఢిల్లీలోని విశ్వసనీయ వర్గాలు అందించిన సమాచారాన్ని విశ్లేషిస్తే ఇవన్నీ నిజమేననిపిస్తున్నది. ముఖ్యంగా పొంగులేటి కుటుంబానికి చెందిన నివాసాలు, ఆఫీసులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దాడులు నిర్వహించడం, ఈడీకి ఎఫ్ఐయూ పక్కా సమాచారాన్ని ఇవ్వడాన్ని చూస్తే, పొంగులేటికి చెందిన కంపెనీలు తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడినట్టు అర్థమవుతున్నదని ఢిల్లీలోని ఉన్నతస్థాయి వర్గాలు పేర్కొన్నాయి.*

### ఏమిటీ ఎఫ్ఐయూ?

*కేంద్ర రెవెన్యూ విభాగంలోని ఓ ప్రత్యేక డిపార్ట్‌మెంట్.. ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ). మనీలాండరింగ్ నిరోధక చట్టం-2002 కింద రూ. 100 కోట్లకు పైబడిన ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులను మాత్రమే ఈ విభాగం పర్యవేక్షిస్తుంది.*

### ఎఫ్ఐయూ సక్సెస్ రేట్ 99 శాతం

*పొంగులేటి కుటుంబం కంపెనీలకు సంబంధించిన వివరాలు, ఆ కంపెనీల ఆర్థిక లావాదేవీలు, ష్యూరిటీ బాండ్లు, ఆదాయపు పన్ను చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎఫ్ఐయూ సిబ్బంది ఈడీ అధికారులకు సమర్పించారు. దీనికి కారణం.. వివరాల సేకరణ, సమాచారం అప్పగింత వరకే ఎఫ్ఐయూకు అధికారాలు ఉన్నాయి. కేసుల విచారణ, సోదాలు కేంద్ర దర్యాప్తు సంస్థలే చూసుకోవాలి. ఈక్రమంలోనే ఎఫ్ఐయూ పొంగులేటి కుటుంబం కంపెనీలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఈడీకి ఇచ్చింది. కాగా, ఎఫ్ఐయూ సేకరించిన సమాచారం 99 శాతం కేసుల్లో నిజమేనని తేలినట్టు ఆర్థికరంగ నిపుణులు చెప్తున్నారు.*

## వందల కోట్ల కేసు..

*రూ. 100 కోట్లకు పైబడిన ఆర్థిక నేరాల కేసులపైనే ఎఫ్ఐయూ దృష్టి సారిస్తుంది. ఈ లెక్కన పొంగులేటి కంపెనీల కేసు వందల కోట్లతో ముడిపడి ఉన్నట్టు స్పష్టమవుతున్నదని అధికారి ఒకరు పేర్కొన్నారు. శుక్రవారం ఈడీ జరిపిన సోదాల్లో మూడు, నాలుగు కౌంటింగ్ మెషీన్లు తీసుకెళ్లడాన్ని చూస్తే.. ఈ కేసు పరిధి రూ. 800 కోట్లు దాటొచ్చని ఆ అధికారి అంచనా వేశారు.*

## రాజకీయ కక్షతోనే ఈడీ దాడులు

### పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాజకీయ కక్షతోనే బీజేపీ సర్కారు మంత్రి పొంగులేటి ఇండ్లపై ఈడీ దాడులు చేయిస్తున్నదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంలో భాగంగానే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని చెప్పారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసమే మోదీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నదని మండిపడ్డారు. ఈ దాడులను రాజ్యాంగబద్ధంగా ఎదుర్కొంటామని స్పష్టంచేశారు. పొంగులేటి ఇండ్లపై ఈడీ దాడులను కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ కూడా ఖండించారు.